# పావని-పట్టుచీర

-డా.రాగతి రమ

తాయారమ్మ వచ్చి కూతురు పెళ్లంటూ పెళ్లికార్డు చేతిలో పెట్టగానే గుండె గుభేల్‌మంది కాంతమ్మకు.

"పావనీ వాళ్లని కూడా పిలుస్తావా?" అని అడిగింది ఆత్రుతగా.

ఆమాటకి తాయారమ్మ నొసలెగరేసి "అదేంటొదినోయ్ అలా అంటున్నావ్. మిమ్మల్ని పిల్చి వాళ్లని పిలవకపోతే ఏం బాగుంటుంది. అసలు మన వీధి మొత్తాన్ని పిలుస్తున్నాను. అందరూ తలోక చెయ్యి వేసి పెళ్ళి జరిపిస్తే అదే పదిలక్షలు" అంది.

గుండె బరువెక్కిన కాంతమ్మ చిరునవ్వు అరువు తెచ్చుకుని "ఓ అలాగే అలాగే" అంది.

"పావనీ వాళ్ల ఇంటికి వెళ్లాలమ్మా వస్తా" అని చెప్పి తాయారమ్మ వెళ్ళిపోయింది కాంతమ్మ గుండెల్లో గుబులు వదిలేసి.

అక్కడే సోఫాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్న కనకారావు పేపర్ పక్కన పడేసి దీక్షగా భార్య ముఖంలోకి చూశాడు.

"ఆ పావని గురించేనా బెంగపడుతున్నావ్?" అన్నాడు.

"అవునండీ. ఈ పావని పెళ్ళి అన్నమాట వినగానే నా పట్టుచీర ఎత్తుకుపోతుందండీ...ఏం చేయను!" అంది కాంతమ్మ బేలగా.

"బాగుంది ఇవ్వకు. మొదట నువ్వే అలవాటు చేసావ్!"

"అవునండీ. ఎరక్కపోయి ఇచ్చాను ఇరుక్కుపోయాను. ఎలా వదిలించుకోవాలో తెలీడం లేదండి"

కనకారావు ఆ మాటకి పకపకా నవ్వాడు.

"నువ్వు ఎంతో గడుసుపిండానివి కదే నీకు ఎలా వదిలించుకోవాలో తెలీడం లేదంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది"

"ఆఁ ఏం ఉంది. ఇల్లు ఖాళీ చెయ్యమంటుందనే నా బాధ"

"ఇంకో ఇల్లే దొరకదా మనకి. ఖాళీ చేసేద్దాం"

"ఆఁ ఖాళీ చేద్దాం. ఏం చెప్పొచ్చారండీ. తక్కువరేటుకి ఇంత విశాలమైన ఇల్లు దొరికి ఏడుస్తుందా ఏమన్నానా. మీకు, అమ్మాయికి ఆఫీసులకి దగ్గర. కనీసం మనం ఇల్లు కొనుక్కునే వరకైనా ఉండాలా వద్దా? ఏమీ ఆలోచించరు మీరు"

"అవునుసుమీ నాది చాలా మట్టి బుర్రేనే కాంతం. అయితే ఏం చేద్దాం. పావనిని ఎలా వదిలించుకుందాం. పాము చావకూడదు-కర్ర విరగకూడదు. పాదరసం లాంటి బుర్ర నీది ఆలోచించు కాంతం" అన్నాడు కనకారావు.

"అదేపనిలో ఉన్నాను" అంది కాంతమ్మ సాలోచనగా.

"ఆలోచించు. తక్కిన ఆడవాళ్లకి ఆదర్శంగా.." అన్నాడు కనకారావు నవ్వుతూ.

* * *

తాయారమ్మ పెళ్లి కార్డు ఇచ్చి వెళ్ళిపోయాక పావని బీరువా తలుపు తెరిచింది. ఎర్ర పట్టుచీర ఫక్కుమంది.

ఆకుపచ్చ పట్టుచీర వెక్కిరించింది. నీలం పట్టుచీర నొసలెగరేసింది. వాటిని చూడగానే పావనికి చిరాకేసింది. పాడిందే పాడరా పాచిపళ్ల దాసరీ అన్నట్లు ఎన్నో సార్లు కట్టుకుంది వీటిని.

"వేలు వేలు పోసి పట్టుచీరెందుకే దండగ!" అంటాడు భర్త.

ఒకసారి తన గోడంతా వెళ్ళబోసుకుంది తమ ఇంట్లో అద్దెకున్న కాంతమ్మ దగ్గర.

"అమ్మాయ్ నా సిందూరం రంగు పట్టుచీర కట్టుకో. నేనెప్పుడూ పట్టుచీరలు కొంటూనే ఉంటా" అని నోరు జారింది కాంతమ్మ.

అంతే అది మొదలు ఏ పెళ్లికి వెళ్లినా, పార్టీకి పోయినా కాంతమ్మ అక్షయపాత్ర అయి కూర్చుంది.

పావని పట్టుచీర అరువు అడగడమూ, ఆవిడ చీర ఇవ్వడం అది కట్టుకుని వెళ్లడం-ఈ చీరలో చాలా బాగున్నావని అందరూ అనడం పావని గర్వంతో మిడిసిపడుతూ ఇంటికి రావడం.

"నన్ను రక్షిస్తున్నావే పావనీ. ఇలాగే ఎవర్నో ఒకర్ని కాకాపట్టి కట్టుకో తీరిపోతుంది. నాజేబు ఖాళీ అవదు. నీ కోరికా తీరుతుంది" అన్నాడు పావని భర్త.

ఆ మాటకి పావని "చేతకాని మొగుడు ఉంటే మరి అంతే గతి. అస్తమాను చీర అరువు అడిగితే కాంతమ్మ కసకసలాడిపోదూ" అంది.

"కసకసానా విసవిసా.. కాంతమ్మ మనింట్లో అద్దెకుంది. ఇవ్వను పొమ్మనదు. ఎందుకంటే మనం ఖాళీ చెయ్యమంటామేమో అని. లేదా అద్దె పెంచుతామేమోనని భయపడి చచ్చినట్లు ఇస్తుంది. నాదగ్గర డబ్బుల్లేకకాదు. ఎందుకు వేస్ట్ అనే నా బాధ. నువ్వేం వర్రీకాకు" అన్నాడు పావని భర్త.

ఆ మాటలు బలాన్నిచ్చాయి పావనికి.

'ఎక్కడికిపోతావు కాంతమ్మా నా గుప్పెట్లో చిక్కుకున్న కాంతమ్మా' అనుకుంటూ పావని మనసు ఉరకలు వేస్తోంది.

ఆమధ్య కాంతమ్మ కొనుక్కున్న పసుపు పట్టు చీర మీదే ఉంది పావని మనసంతా.

"ఆ చీర ఇప్పుడే వెళ్లి తెచ్చుకోకపోతే నాకు నిద్రపట్టదండీ!" అంది పావని.

"శుభస్యశీఘ్రం పోయేదేముంది. వెళ్లి తెచ్చుకో" అన్నాడు పావని భర్త.

కాంతమ్మ, కనకారావు, కూతురు భోంచేసి హాలులో కూర్చుని టీవీ చూస్తున్న వేళ సుడిగాలిలా ప్రవేశించింది పావని.

కసినంతా కంఠంలో మింగి "రా రా పావనీ నీకోసమే ఎదురుచూస్తున్నా" అంది.

"ఆంటీ మీరోసారి ఇటురండి" అంది పావని.

మనస్సులో తిట్ల దండకం వల్లిస్తూనే లేచి పావని వద్దకు వెళ్లింది కాంతమ్మ.

"ఏమిటి సంగతి?"

"నాకు.. నాకు" సిగ్గుసిగ్గుగా ఆగింది పావని.

"చల్లకొచ్చి ముంత దాయడం ఎందుకు చెప్పు పావనీ" అంది కాంతమ్మ పళ్ళు నూరుకుంటూ.

"తాయారమ్మ గారి పెళ్లికి మీ పసుపుపట్టుచీర నాకు ఒకసారి అరువివ్వరూ. ఆయన కొని చావరు

ఏం చేయను ఆంటీ'' దీనంగా అంది పావని మన సులో నవ్వుకుంటూ.

'దీని కళ్ళు పసుపు పట్టుచీర మీద పడ్డాయన్న మాట. సొమ్మొకడిది సోకొకడిది. దీనికి కీలెంచి వాత పెట్టాలి లాభం లేదు ఊరుకుంటే!' అనుకుంటూ కాంతమ్మ వెళ్లి పట్టుచీర పట్టుకుని వచ్చి పావని చేతుల్లో పెట్టింది.

"ఎంత మంచివారు ఆంటీ మీరు'' అంటూ పొగిడి పొగిడి వెళ్లిపోయింది పావని.

వెళ్ళేటప్పుడు "మీ పట్టుచీర నేను కట్టుకున్నాన న్నట్లుగా ఎవరికీ చెప్పరుగా'' అని చెప్పి మరీ వెళ్లింది.

కాంతమ్మ ఆలోచనలో పడింది.

* * *

"బాబోయ్ మీ పట్టుచీర నా కొద్దు!'' అంటూ పావని పారిపోయేలా చేయాలి. అదే ఎలా..? కాంతమ్మ ఆరోజు నిద్రపోలేదు ఆలోచనతో.

తన పట్టుచీరలన్నీ కట్టి కట్టి వదిలిపెడుతుంటే వెర్రిబాగులదానిలా చూస్తూ ఊరుకోవాలా. సహించను, నేను సహించను కాక సహించను. అప్పుడే తళుక్కున మెరిసిందో సామెత బుర్రలో.

'పట్టుచీర ఎరువిచ్చి పీట పట్టుకు తిరిగినట్లు' అని ఎప్పుడూ తల్లి అంటుండేది. తన ఐడియా



గురించి ఇంట్లో ఎవరికీ చెప్పలేదు కాంతమ్మ.

పెళ్లిరోజు రానే వచ్చింది.

* * *

ఆరోజే తాయారమ్మ కూతురు పెళ్లి. పసుపు పట్టుచీరలో అప్సరసలా తయారైంది పావని.

తట్టెడుపూలు తల్లో, మెళ్ళో హారం చేతులకు గోరింటాకు, బంగారుగాజుల మధ్య పసుపురంగు గాజులు, ఘల్లుఘల్లుమంటూ పాదాలకు మువ్వలపట్టీలు, నుదుటిమీద పసుపురంగు తళుకుబొట్టు. పెదవులకు లిప్‌స్టిక్.

ఉదయం తొమ్మిదైంది.

పావని, ఆమె భర్త తాయారమ్మ ఇంటికొచ్చారు. బంధువులతో కిటకిటలాడుతోంది ఇల్లు.

పేరంటాళ్ళు కొంతమంది "పావనీ చీర అదిరిపోతోంది. ఎంత బాగున్నావో!" అన్నారు.

గర్వంతో ఉప్పొంగిపోయింది పావని మనసు.

పెళ్లికూతురు గదిలోకి వెళ్లింది పావని. అక్కడ కూర్చుని ఉంది కాంతమ్మ.

పావనిని చూడగానే లేచి దగ్గరగా వచ్చింది.

"పావనీ పెళ్లికూతురుమీద అక్షింతలు వేయ్" అన్నారెవరో-

మరొక ఆవిడ పావని చేతిలో అక్షింతలు పెట్టింది.

కాంతమ్మ కొంచెం గట్టిగానే "పావనీ చీర జాగ్రత్త పసుపూ అవీ ముట్టుకోకు చీరకు మరకలవగలవు" అంది.

"అయ్యో కాంతమ్మగారు చీరకు జాగ్రత్తలు చెబుతున్నారే" అంది ఒకామె.

పావని కొంచెం గతుక్కుమన్నా పట్టించుకోకుండా కూర్చుంది.

"అక్కడ కాఫీలు, టిఫిన్లు అవుతున్నాయి పదండి" అంది తాయారమ్మ వచ్చి.

అందరితోపాటూ పావని కూడా డాబామీదకు వచ్చింది. అక్కడ అంతా టిఫిన్లు లాగిస్తున్నారు.

పావని ఇడ్లీలు సాంబారు పోయించుకుని తింటుంటే కాంతమ్మ గబగబా వచ్చి-

"చీర జాగ్రత్తమ్మా పావనీ. సాంబారు మరకలు పడేను" అంది.

ఆమాటకు అక్కడున్న పేరంటాళ్ళు తిరిగి తిరిగి చూశారు పావనిని.

చీర తనది కాదని పోల్చేసారేమోనని సిగ్గు కలిగింది పావనికి.

ఇంతలో ఎవరో గులాబ్‌జాం ప్లేట్ పావని చేతిలో పెట్టారు.

అది గమనించింది కాంతమ్మ దగ్గరగా వచ్చి అంది "అది తినకు పాకం అంతా చీర మీద ఒలుకుతుంది. ఇటివ్వు" అంటూ గులాబ్‌జాం ప్లేట్ లాక్కుంది.

అది గమనించిన ప్లీడర్‌గారి భార్య-

"నీ చీరపాడవుతే ఈ కాంతమ్మగారికి ఎందుకు అంత ఆత్రుత, విడ్డూరం కాకపోతే" అంది.

"అదే తెలీడం లేదు" నీరసంగా అంది పావని.

పావనికి కాంతమ్మని చూస్తుంటే నరికి పోగులు పెట్టాలన్నంత కసి కలుగుతూ ఉంది.

గబగబా వెళ్ళి మరో గులాబ్‌జాం ప్లేటు తెచ్చుకుని తింటుంటే కాంతమ్మ చరచరా దగ్గరకు వచ్చి "తింటే తిన్నావుకానీ చీర జాగ్రత్త. చీర జాగ్రత్త" అంటూ హెచ్చరించింది.

తిన్నాక చెయ్యి కడుక్కుంటూ ఉంటే కాంతమ్మ వచ్చి "చెయ్యి చీరకు తుడవకమ్మాయి, నువ్వు రుమాలు తెచ్చినట్టులేవు. ఇదిగో నా రుమాలుతో తుడుచుకో చెయ్యి" కాంతమ్మ రుమాలు అందించింది.

తెల్లముఖంతో రుమాలు అందుకుంది పావని.

"ఈ చీర ఎంత పావనీ...?" ప్లీడర్ గారి భార్య దగ్గరగా చేరి అడిగింది.

"ఐదువేలు" గర్వంగా చెప్పింది పావని.

"అందుకేనమ్మా చీరకు జాగ్రత్తలు చెబుతున్నాను" అంది అక్కడే ఉన్న కాంతమ్మ.

"నా చీరా ఐదువేలే మరి నాకు చెప్పరేం జాగ్రత్తలు?" అంటూ పావనిని చూసి నవ్వింది ప్లీడర్‌గారి భార్య.

ఆమాటకు కళ్ళు తిరిగినట్లయింది పావనికి. అక్కడినుంచి మెల్లగా జారుకుంది.

భర్త టీ త్రాగుతూ ఉండడం గమనించి టీ కప్పుతో సహా అక్కడకు చేరింది పావని.

"ఏం అదోలా ఉన్నావు?" అడిగాడు ఆమె భర్త.

"తర్వాత చెప్తాను"


## పదిటన్నుల మన్ను తిన్న మహిళ

ఎనిమిదేళ్ల వయసునుండే మట్టి, బురద వంటివి తింటూ ఆరోగ్యవరంగా ఎలాంటి హాని లేకుండా 78 సంవత్సరాలు బ్రతకడమంటే మాటలా? అంత వయసు వచ్చినా ఈ రోజుకీ ఈ వృద్ధురాలు నిత్యం మట్టినే తింటూ వుంటుంది. 10 టన్నుల మట్టి తిని కూడా హాయిగా, ఆరోగ్యవంతంగా వున్న ఈ చైనా మహిళ పేరు హాఫ్‌ఫెన్‌గ్లాన్. నార్త్ చైనాలోని జాంగ్జీ ప్రాంతానికి చెందిన ఈమె ఈ విషయంలో ప్రపంచంలోని వైద్య మేధావుల్ని విస్మయానికి గురి చేసింది. 10 టన్నుల మట్టి తిన్నా ఈమె ఆరోగ్యం పాడుకాకపోవడం విషయమై వైద్య పరిశోధకులు తలలు బాదుకుంటున్నారు. ఇంకా విచిత్రమైన విషయం ఏమిటంటే ఒక్కరోజు మట్టి తినకపోయినా ఆరోజు ఏదో నలతగా ఉంటుందిట ఆమెకు.

## పబ్లర్ పక్షి

చిలక, మైనా పక్షులు మనుషులు చెప్పిన మాటల్ని నేర్చుకుని తిరిగి మాట్లాడతాయి. మాట్లాడే ఈ పక్షులంటే మనకెంతో ఇష్టం. కానీ వీటికన్నా పబ్లర్ పక్షి మనుషులు ఏది చెప్పినా అదే మాట తిరిగి పునరుచ్చరణ చేస్తుంది. మంచి ధ్వన్యనుకరణ చేయడంలో మహాదిట్ట ఈ పబ్లర్ పక్షి.

-భూక్యా గోపీనాయక్



ఇంతలో వాళ్ల దగ్గరకు గబగబా వచ్చింది కాంతమ్మ.

"పావనీ టీ చుక్కలు పడేను చీర ఖరాబు అవుతుంది జాగ్రత్తమ్మా"

ఆ మాటతో పావని భర్త ముఖం మాడిపోయింది. అసలు విషయం అర్థం అయింది.

"ఇంతవరకూ జరుగుతున్న భాగోతం ఇదా..నిన్ను ఏడిపిస్తూ ఉంది కదూ...!"

"అవును"

"మరెందుకు కట్టుకున్నావ్?"

"గతిలేక" చురచురా చూసి చరచరా అక్కడినుంచి వెళ్లిపోయింది పావని.

ఇంతలో ప్లీడర్‌గారి భార్య పిలిస్తే ఇద్దరూ పెరట్లోకి వెళ్లారు.

అక్కడ గాడి పొయ్యిల మీద పదార్థాలు గుబగుబ వుడుకుతున్నాయి. అంతలో తాయారమ్మ వచ్చి "పావనీ, మీరిద్దరూ కాస్త ఆ లడ్డూలు లెక్కపెట్టండి" అంది.

కాంతమ్మ పీట పట్టుకుని పరుగుపరుగున వచ్చింది.

"పావనీ ఈ పీటమీద కూర్చుని లెక్కపెట్టు లడ్డూలు. లేకపోతే చీర మాసిపోతుంది" అంది.

"అదేమిటండీ కాంతమ్మగారూ పావని పట్టుచీర అంటే మీకెందుకు అంత ప్రేమ?" అడిగింది ప్లీడర్‌గారి భార్య నవ్వాపుకుంటూ.

"వాళ్లింట్లో అద్దెకున్నాను కదా అందుకు" అంది కాంతమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ.

పావని కసికసిగా కాంతమ్మ వేపు చూసి రివ్వున అక్కడినుంచి వెళ్లిపోయింది.

ఒంటిగంటకు భోజనాలు మొదలయ్యాయి.

రెండుసార్లు ప్రయత్నించినా భోజనాల దగ్గర సీట్లు దొరకలేదు పావనికి, భర్తకి.

మూడో బంతిలో కూర్చున్నారు ఇద్దరూ.

వడ్డింపులు జరుగుతున్నాయి. ముద్దనోట్లో పెట్టుకోబోతున్న పావని వద్దకు వచ్చి వాలింది కాంతమ్మ.

"పావనీ జాగ్రత్తరా..పులుసులూ అవీ చీరమీద పడేను" అంది.

ప్లీడర్‌గారి భార్య పావని పట్టుచీరను చూపిస్తూ ఎవరితోనో ఏదో అంటోంది.

పావనికి మతి పోయినట్లయింది.

భోజనం ముగించి చెయ్యి కడుక్కోవడానికి వెళుతుంటే కాంతమ్మ చరచరా దగ్గరకు వచ్చింది.

"పావనీ కాస్త కుచ్చెళ్ళు ఎత్తిపట్టుకుని వెళ్లమ్మా బురద అంటుకుంటుంది" అంది.

పావని దిమ్మెరపోయింది. పేరంటాళ్ల గుడ్లగూబ చూపులు గుచ్చేస్తున్నాయి.

చెయ్యి కడుక్కుని వచ్చి కిళ్లీ తీసుకుని వేసుకోబోతూ ఉంటే "జాగ్రత్త. కిళ్లీ నములుతున్నప్పుడు పొరపాటున చీరమీద పడొచ్చు. చీర ఖరాబు కాగలదు" అంది కాంతమ్మ దగ్గరగా వచ్చి.

ప్లీడర్ గారి భార్య ఫకాలుమంది.

పావనికి తల తిరిగిపోయింది.

"ఏమండీ ఇంటికి పోదామండీ" అంది భర్తతో.

"అప్పుడే"

"ఈచీరని విప్పి పారేయాలి అంతవరకూ నాకు మనశ్శాంతి లేదు" ఇద్దరూ వీధిలోకి వచ్చేటప్పటికి కాంతమ్మ గొడుగు పుచ్చుకుని పరుగుపరుగున వచ్చింది.

"అమ్మాయ్ పావనీ! ఆకాశం నిండా మబ్బేసింది. కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. చీర తడిసిపోయేను జాగ్రత్తమ్మా. ఈ గొడుగేసుకుని వెళ్లండి"

పావని గొడుగు తీసుకుని భారంగా అడుగులు వేసింది.

ఇంటికి రాగానే చీర విప్పి విసిరికొట్టింది పావని.

"అదేంటి పావనీ?" అన్నాడు భర్త.

"పరులసొమ్ము బరువు చేటని ఈరోజే తెలుసుకున్నాను. జన్మలో కాంతమ్మని చీర అరువు అడక్కుండా గుణపాఠం నేర్పింది"


"అలాగా!"

"అలాగా..ఎలాగా కాదు. మీతో పట్టుచీర కొనిపించుకోకపోతే నా పేరు పావనే కాదు. ఇంటగెలిచి రచ్చ గెలవమన్నారు పెద్దలు తెలుసా!" అంది పావని తెలివిగా.

ఆ మాటతో తెల్లముఖం వేశాడు పావని భర్త.

★

## మొనాటనీకి దూరం



ఎప్పుడూ ఒకేరకం పాత్రలు పోషించడం ఎలాంటి నటులకైనా బోర్‌గా అనిపిస్తుంది. ఎప్పుడూ మొనాటనీకి దూరంగా ఉండే నాగార్జున ఇపుడో మంచి చిత్రంలో నటిస్తున్నాడు. సంతోషం, మన్మథుడు చిత్రాలతో యూత్‌ని ఆకట్టుకున్న నాగార్జున 'అన్నమయ్య' చిత్రం తర్వాత ఇప్పుడు శ్రీరామదాసుగా దర్శనం ఇవ్వబోతున్నాడు. మధ్య మధ్య మాస్, సూపర్ చిత్రాలతో అన్నివర్గాలకి దగ్గరయిన నాగార్జున తానెప్పుడూ వెరైటీగా నటించడానికే ప్రాధాన్యత ఇస్తానంటున్నాడు.

